## చిన్నకథ

# పుణ్యం ఖరీదు

నాకు దేవుడి మీద నమ్మకం వుంది. భక్తి వుంది. కాని దాన్ని ప్రదర్శించడం మాత్రం నాకిష్టం వుండదు. ఇంట్లో నాకయి నేను పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, జాగరణలు వగైరా కార్యక్రమాలేవీ చెయ్యను. నమ్మకం వ్యక్తిగతమైంది. దాన్ని ప్రదర్శనకు పెట్టాల్సిన అవసరం లేదని నా విశ్వాసం.

నా శ్రీమతికి మాత్రం నోములు, వ్రతాలు, పూజలు వగైరా లంటే చాలా యిష్టం. ఇంట్లో దేవుడి పటానికి పూజచేసి, మంగళహారతి వగైరాలు ఇస్తూ వుంటుంది. అప్పుడప్పుడు ఉపవాసాలుంటుంది. పూర్తిగా ప్రజాస్వామ్యవాదిని గాబట్టి ఆవిడ ఇష్టానికి నేనడ్డుపడను. అందువల్లనే సంసారం ఒడిదుడుకులు లేకుండా సజావుగా నడుస్తున్నది. మా పిల్లలు ఒకరు తల్లి పక్షమైతే ఒకరు నా పక్షం.

కార్తీకమాసం. నెలంతా పవిత్రమైందే. నా శ్రీమతి ప్రతిరోజూ ఉదయం తలస్నానం వగైరా ఆర్భాటాలతో పూజలు మరింత ఘనంగా చేస్తుంది. సోమవారం పగలంతా ఉపవాసం వుండి రాత్రి మాత్రం భోంచేస్తుంది.

ఆరోజు కార్తీక సోమవారం. తెల్లవారుజామునే లేచి తను తలస్నానం చేసి, పిల్లలకు తలంట్లు పోసి, తను పట్టుచీరె కట్టుకున్నది. పిల్లలకు వున్న వాటిలో మంచి దుస్తులు తొడిగింది. స్నానం చెయ్యమని, మంచి దుస్తులు వేసుకోమని నన్ను కూడా తొందర పెట్టింది. దీనంతటికీ కారణం కపిలతీర్థం దగ్గరి కపిలేశ్వరస్వామిని దర్శించి తన భక్తి ప్రపత్తులను వీలయినంత ఎక్కువగా ప్రకటించుకోవాలనే ఆసక్తితో.

ఉదయం ఏడు, ఏడున్నర కల్లా తయారై టెంకాయ, పూలు, కర్పూరం వగైరాలతో సకుటుంబంగా బయలుదేరాం. కపిలతీర్థం మేమున్న చోటికి ఒక కిలోమీటరు దూరంలో ఉంది. అందరం హుషారుగా అక్కడికి నడిచాము.

తీరా అక్కడికి చేరేసరికి ఒకే రద్దీ. ఇసుకవేస్తే రాలనంత జనం. తోపులాట, తొక్కిసలాట. జనంలో ప్రతి ఒక్కరికీ కపిలేశ్వర స్వామిని వీలైనంత త్వరగా చూచి ఇల్లు చేరుదామనే తొందరే. ఆ తొందర మాకూ ఉంది. కాసేపాగి రద్దీ తగ్గింతర్వాత చూద్దాం అన్న ఓర్పు ఎవ్వరిలోనూ లేదు. నిజానికి మాలోనూ లేదు. జనాన్ని తోసుకుంటూ ముందుకు నడిచాము. లౌడ్ స్పీకర్లో కార్తీకమాస మహాత్మ్యం గురించిన ఉపన్యాసం వినిపిస్తున్నది.

ఎదురుగా తిరుపతి కొండల్నుంచి దూకుతున్న సెలయేళ్లు. కోనేటి నిండా నీళ్లు. అందులో భక్తుల స్నానాలు. వగైరాలతో మనోహరంగా, నేత్ర పర్వంగా వున్నదంతా. 'మీరు పోయి చూచిరండి. నేనీ జలపాతాన్ని, జనాన్ని చూస్తూ కూచుంటాను' అంటే నా శ్రీమతి ఒప్పుకోలేదు. 'రా డాడీ' అంటూ పిల్లల పిలుపులు. వాళ్లతో భక్తుల తోపుడును అనుభవించక తప్పలేదు. దాదాపు రెండు గంటల సేపు నలిగిపోయాము. ఒళ్లంతా చెమటలు పట్టింది. జన సమూహం నుండీ బైట కొచ్చిం తరువాత ప్రాణానికి హాయిగా వుంది. చల్లటి గాలిని పీల్చుకున్నాము.

తెచ్చిన టెంకాయలో సగం గుడి అర్చకుడు వుంచుకుని రెండో సగం మాకిచ్చాడు. దాంతోపాటు రెండు, మూడు పూలు కూడా ఇచ్చాడు.

బయటికొచ్చి కాస్త విశాలంగా వున్న చోట్లో కూర్చొని కొబ్బరి చిప్ప కొట్టుకొని తినే ప్రయత్నంలో వున్నాము.



గుడిలోపల ఎందరు భక్తులున్నారో, గుడిబయట సమాన నిష్పత్తిలో బిచ్చగాళ్ళున్నారు. భక్తుల మనసుల్లో దయను కల్పించేందుకు, వీలయినంత ధర్మం పొందేందుకు వాళ్ల యాతనలు వాళ్లు పడుతున్నారు.

'ఇంత రద్దీలో రాకుండా వుంటే బాగుండేది' అన్నాన్నేను.

'రద్దీ ఎప్పుడూ వుండేదే. అందరితోపాటు దేవుణ్ణి చూస్తే పుణ్యంగానీ మనమొక్కరమే వస్తే అందులో అందం, చందం ఏముంటాయి?' అంటున్నది శ్రీమతి.

పిల్లలు కొబ్బరి కోసం ఆతృతతో వున్నారు.

ఇంతలో ఒక బిచ్చగాడు 'ధర్మం చెయ్ బాబు' అంటూ బొచ్చె ముందుకు జాపాడు. వాడు మన దయకు పాత్రుడు గానే వున్నాడు లెమ్మనుకుంటూ ఒక రూపాయి వాడి బొచ్చెలో వేశాను. జేబులో అర్ధరూపాయి బిళ్ళ కూడా వుంది. కానీ 'అధికస్య అధికం ఫలం' అన్నారు. ఎక్కువిస్తే ఎక్కువ పుణ్యం అన్న భావంతోనో, దయ ఆ క్షణంలో ఎక్కువయినందు వల్లనో రూపాయి వేశాను.

వాడు నా వంక ఎగాదిగా చూశాడు.

''పొద్దున్నించీ మీలాంటి మా రాజులకోసమే కాసుకొని వున్నా బాబయ్యా! ఒక పది కాయితమన్నా యెయ్యండి' అన్నాడతను.

'పది వూరికే వస్తుందనుకున్నావా? రూపాయిచ్చిందే ఎక్కువ. చాలుపో' అన్నాను.

'కొండమీద దేవుడికి లక్షలు, కోట్లు కుమ్మరిస్తారు. మా కాడి కొచ్చేసరికి బాబులకు చేతులు రావు'

'అసలు ఏదైనా పని చేసుకోక ఈ పనికెందుకు పూనుకున్నావయ్యా?' అన్నాను.

'మీరందరూ ఈడ కొచ్చేది పున్నెం కోసవఁని గాదా సాఁవీ! మేం ల్యాకపోతే దేవుడేడున్నాడు. దర్శనమ్యాడుంది. అసలు మేమందరం ఇట్టా వున్నది మీ పున్నెం కోసవేఁ గద బాబయ్యా. ఆల్లు లచ్చులు, కోట్లు ఇచ్చి పున్నెం కట్టుకుంటే మీరు పద్దైనా యాకపోతే ఎట్టా బాబయ్యా? మీకు రూపాయి పున్నెం సాలా? పది రూపాయల్దొద్దా?' అంటూ నిలదీశాడు వాడు.

కొండమీది దేవుడికి లక్షలు, కోట్లు ఎటుదిరిగీ ఇవ్వలేము. ఆయన్ను పెద్దలకు వదిలేసి ఈ బీదనారాయణుడికి పదన్నా ఇద్దాం.

పుణ్యం దగ్గర పిసినారితనం మంచిది కాదని జేబులోంచి పది కాయితం తీసి బొచ్చెలో వేశాను.

'మరీ అంతా!' అన్నది శ్రీమతి.

'ఇట్లాగైనా మరింత ఇస్తాడేమో చూద్దాం. అప్పుడు పైన వేలకో, లక్షకో పుణ్యం కొనుక్కుందాం. ఇప్పుడు పది రూపాయల పుణ్యంతో తృప్తి పడదాం' అంటూ అందర్నీ ఇంటికి బయల్దేర దీశాను.

– సిహెచ్. నాగార్జున శర్మ